వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఆమె శీలవతి కాదు గనక మాన భంగానికి అంగీకరించి ఉండవచ్చు. దానికి సాక్ష్యం ఏమిటంటే ఆమెకు ఒక ప్రేమికుడున్నాడు. పై సంఘటనలను బట్టి ఏమి రుజువవుతుందంటే సమాజం నిర్దేశించిన లేక నిర్వచించిన ఆచార వ్యవహారాల ప్రకారం స్త్రీలు ఉండాలి, లేకపోతే అలాంటివారిపై అత్యాచారాలు పెద్ద తప్పు కానట్టు న్యాయాధిపతులెందుకు నిర్ణయిస్తారు ?

మంజుశ్రీ అనే ఇరవైయేళ్ళ యువతిని ఆమె భర్త పొటాషియం సైనేడ్ ఇచ్చి చంపేశాడు. సెషన్స్‌కోర్టు, హైకోర్టుకూడా అతనిని దోషిగానే తీర్పు యిచ్చాయి. కాని సుప్రీంకోర్టు మాత్రం మంజుశ్రీది ఆత్మహత్యగానే నిర్ధారించింది. దానికి కారణాలను ఇలా విశ్లేషించారు. మంజుశ్రీ చాలా సెన్సిటివ్. ఆమె భర్త ఎప్పుడూ తన దగ్గరే వుండాలని కోరుకునేది. బయట సమాజంలో ఒక మగవాడుగా వ్యాపారం, ఇతర అనేక కార్యకలాపాల్లో మునిగివున్న భర్తకు అలా వుండడం వీలుకాలేదు. దాంతో మంజుశ్రీ నిరాశ పొందింది, ఆవేదన చెందింది, డిప్రెషన్‌కు లోనయింది, అందుకే ఆత్మహత్య చేసుకుంది అని.

ఇంక వరకట్న హత్యల విషయంలో తీర్పులు నిందితుల్ని రక్షించేవిగా ఉంటాయి. హత్యలన్నీ ఆత్మహత్యలుగా నిర్ధారింపబడి, కొన్ని కేసుల్లో ఆ యువతుల తెలివిమాలిన తనంవల్లనే అవి జరుగుతున్నట్టు నిర్ధారించారు. ఈ హత్యలలో హతురాలి మరణ వాఙ్మూలం చాల కీలకమైనది. ఇక్కడ కూడ కోర్టులు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయి. సాధన అనే యువతి తన మరణ వాఙ్మూలంలో తమ మంటల్లో కాలి మరణించటానికి భర్త కారకుడు కాదు అని చెప్తే జడ్జి వెంటనే నిందితుడిని నిర్దోషి అని తీర్పు చెప్పారు. కాని షన్నీకౌర్ మరణవాఙ్మూలంలో తన భర్తే తనను కాల్చి చంపాడని మూడుసార్లు చెప్పినా జడ్జిగారు ఆ వాఙ్మూలాలన్నీ తిరస్కరించి ఆమె భర్తను నిర్దోషిగా తీర్పు చెప్పారు. మొదటిసారి ఆమె డాక్టరు కిచ్చిన వాఙ్మూలాన్ని తిరస్కరించడానికి జడ్జిగారు చూపిన కారణం ఏమిటంటే, ఆమె వాఙ్మూలం ఇవ్వడానికి సరైన స్థితిలో ఉందోలేదో పరీక్షించకుండానే డాక్టర్‌గారు ఆమె నుండి వాఙ్మూలం తీసుకున్నారు అని. రెండవసారి పోలీసాఫీసరుకి ఇచ్చిన వాఙ్మూలం తిరస్కరించడానికి సాకు ఏమిటంటే వరకట్నం చావులను పరిశోధించి, బహుమానాలను పొందుదామనే ఉద్దేశ్యంతో పోలీసు అలాంటి వాఙ్మూలాన్ని రికార్డుచేసి వుండవచ్చునని. మూడవ సారి మరో డాక్టరు తీసుకున్న వాఙ్మూలాన్నికూడా ఆమె స్పృహలో లేనప్పుడు రికార్డు చేశారని తిరస్కరించారు.

ప్రత్యేక స్త్రీల కోర్టులను ఛాలెంజ్ చేస్తూ ఈ మధ్య ఒక రిట్ పిటీషను దాఖలయింది. ఈ పిటిషన్ వాదన ఏమిటంటే, స్త్రీల ప్రత్యేక కోర్టులలో జడ్జీల ద్వారా పురుషులకు న్యాయం జరగదని. ఈ వాదన నిజమయితే పురుషజడ్జీలు ఇప్పటిదాకా స్త్రీల కేసుల్లో పక్షపాత వైఖరి నవలంబించారని ఒప్పుకోవలసి ఉంటుంది గదా!

# రిపోర్టులు

# గృహ విధ్వంసనం

ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఏదో ఒక వర్గం లేక వ్యవస్థ బాగోగులకు తనను తాను అంకితం చేసుకుంటూ ఉంటుంది. ఒక సంవత్సరాన్ని "అంతర్జాతీయ బాలల సంవత్సరం" అని, ఒకటి "మహిళల సంవత్సరం" అని, ఒకటి "పరిసరాల పరిశుభ్రత" సంవత్సరం అనీ ప్రకటిస్తూ ఉంటుంది. ఆ ప్రకటనను అనుసరించి ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఆయా వర్గాల లేక వ్యవస్థల అభివృద్ధికోసం ప్రత్యేక కేటాయింపులు జరపాలనీ, ప్రత్యేకశ్రద్ధ చూపాలనీ, వారి ఉద్దేశ్యం.

1987 ను Internahional year of shelter for the Homeless అని ప్రకటించారు. అంటే నిరాశ్రయులకు ఆవాసాలు కల్పించడానికి ఈ సంవత్సరం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దాని కోసం సభ్యదేశాలు నిధులు కేటాయించాలి. పథకాలూ ప్రణాళికలూ రూపొందించాలి. ఉన్న ఇళ్ళు కూల్చేస్తున్న ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ ఏం చూపుతాయని ఆశ్చర్యపోతారేమో. మీ సందేహం నిరాధారం కాదని ధృవపరచుకొనడానికి ఈ క్రింది రెండు రిపోర్టులు చదవండి.

గత మూడేళ్ళుగా - 1984 వేసవి నుండి - మన రాష్ట్ర ప్రభుత్వం "నక్సలైట్ల ఏరివేత" కార్యక్రమంలో ఒక పథకాన్ని చేపట్టింది. అదేమిటంటే నక్సలైట్ పార్టీల కార్యకర్తల ఇళ్ళు, సానుభూతిపరుల ఇళ్ళు, కూల్చడం, తగలబెట్టడం, పూర్తిగా నిరుపయోగమయ్యేలాగ ధ్వంసం చేయడం. ప్రత్యేకించి ఈ పథకం ఆదిలాబాద్, కరీంనగర్, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో అమలులో వుంది. కరీంనగర్‌లో మైదాన ప్రాంతాల గ్రామీణుల ఇళ్లుకాగా, తక్కిన మూడు జిల్లాలలో అటవీప్రాంతాల గిరిజన గూడాలను పోలీసులు ధ్వంసం చేస్తున్నారు. ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల గురించి కొన్ని రిపోర్టులు గతంలో ఇచ్చాము. ఇప్పుడు విశాఖపట్నం, కరీంనగర్ జిల్లాలనుండి రెండు రిపోర్టులు ఇస్తున్నాం. త్వరలో ఇంకింత సమగ్రమయిన సమాచారం "స్వేచ్ఛ"లో ఇవ్వగలుగుతామని ఆశిస్తాము. బహుశా ఎంత కాదన్నా ఇప్పటికి 2500-3000 ఇళ్ళదాకా నాశనంచేసి ఉంటారేమో! సగం విరగొట్టినవీ, ఇంటి సామాన్లు నాశనం చేసినవీ ఇక్కడ లెక్క పెట్టడంలేదు- పూర్తిగా ధ్వంసం చేసిన వాటి సంఖ్య ఇది.

## విశాఖపట్నం

విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు ఈ సంవత్సరం మార్చి నుండి మే నెలదాకా 46 గిరిజన గూడాలను మొత్తంగా తగలబెట్టారు. చింతపల్లి రెవెన్యూ మండలంలో 20 గూడాలు, గూడెం-కొత్తవీధి (జి. కె. వీధి) మండలంలో 26 గూడాలు తగలబడ్డాయి. ఒక "గూడెం" అంటే అయిదు కొంపలు

కావచ్చు, సలభై కావచ్చు - అంతకంటే పెద్ద గూడాలు ఈ ప్రాంతంలో లేవు. తగలబెట్టిన గూడాల పేర్లు, ఇళ్ళ సంఖ్య, ఇక్కడ ఇస్తున్నాము.

| గూడెం | ఇళ్ళ సంఖ్య |
|---|---|
| **చింతపల్లి మండలం** | |
| గంజిగెడ్డ | 24 |
| రోలంగి | 4 |
| కిక్కిసబండ | 14 |
| గొడుగు మామిడి | 23 |
| సీతారాంపురం | 19 |
| పప్పుల మామిడి | 24 |
| బోయలగూడెం | 20 |
| పొర్లుబండ | 12 |
| తాడిపాలెం | 17 |
| వంట్లమామిడి | 12 |
| కొర్రమామిడి | 9 |
| కొత్తవీధి | 8 |
| రాచపనుకు | 9 |
| తోటమామిడి | 25 |
| జిర్రిగడ్డ | 4 |
| గాదుగుల | 5 |
| ఎర్రబల్లి | 5 |
| తాటిపర్తి | 11 |
| వేనాం | 11 |
| కాగుల బండ | 4 |
| మొత్తం 20 గూడాలు | 260 ఇళ్లు |
| **గూడెం - కొత్తవీధి మండలం** | |
| తియ్య మామిడి | 23 |
| తెంటల వీధి | 22 |
| గంపరాయి | 4 |
| భీమల్లారం | 17 |
| జోడిమామిడి బండ | 12 |
| కట్టుపల్లి | 6 |
| కట్టుపల్లి మెట్టవీధి | 5 |
| మోదిల బండ | 21 |
| దిబ్బల మామిడి | 11 |
| అన్నవరం | 9 |
| సిగినపల్లి | 14 |
| పులుసు మామిడి | 14 |
| లింగవల్లు మెట్టవీధి | 14 |
| పారికులు | 22 |
| పొర్లుబండ | 11 |
| కనిమామిడి | 11 |
| దిబ్బమామిడి | 3 |
| వల్లబెల్లి | 37 |
| గోముఖాడ | 14 |
| చిత్రమామిడి | 41 |
| గొడుగుబండ | 30 |
| బొర్రమామిడి | 12 |
| దేగలపాడు | 6 |
| పనుకు కొత్తూరు | 6 |
| గొర్రెలదొయి | 7 |
| గొర్రెలోయి గొందె | 6 |
| మొత్తం 26 గూడాలు | 378 ఇళ్లు |
| రెండు మండలాలు కలిపి మొత్తం 46 గూడాలు | 638 ఇళ్లు |

ఇళ్లు తగలబెట్టారు అంటే ఇంట్లోని సామాన్లు ఖాళీ చేయించి ఇల్లు మాత్రం తగల బెట్టారనికాదు. ఉన్నపళాన తగలబెట్టారు. జనం కాపాడుకోగలిగింది కాపాడుకున్నారు. ధాన్యం, కోళ్లు, ధాన్యం బస్తాలలో దాచుకున్న కరెన్సీనోట్లు, పెద్ద ఎత్తున ధ్వంసం అయ్యాయి. మేకలు, పశువులు కొన్ని కాలి చనిపోయాయి. ఒక మనిషి ప్రాణం కూడ పోయింది. తియ్యమామిడి గ్రామానికి చెందిన సీదరిగాసి కాలుతున్న తన ఇంట్లోని ధాన్యాన్ని బయట వెయ్యాలనే ప్రయత్నంలో ఆ అగ్గిలో తాను చిక్కుకుని తగలబడి పోయాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

41 ఇళ్లు తగలబడిన చిత్రమామిడిలో ఆ ఇళ్లలోని ధాన్యం (వడ్లు, చోళ్ళు) 500 బస్తాలు, 40 మేకలు, 100 కోళ్లు కాలిపోయాయి. అంతేకాక, అంతకు ముందు వారమే కొంత ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు పెద్ద ఎత్తున అగ్నికి ఆహుతి అయ్యాయి. బ్యాంకు సౌకర్యం అందుబాట్లో లేని కారణంగా ధాన్యం బస్తాలలో కరెన్సీనోట్లు దాచుకుంటారు. అవి ధాన్యంతో బాటు తగలబడి పోయాయి. కొర్ర గురువు ఇంట్లో 10,000 రూ॥, వంతల రామారావు ఇంట్లో 2,500 రూ॥, కొర్ర దొన్ను ఇంట్లో 5,500 రూ॥, గుంట రాంచందర్ ఇంట్లో 3,000 రూ॥ తగలబడి పోయాయి.

14 ఇళ్ళు తగలబడిపోయిన గోముఖాడలో 70 కోళ్ళు కాలి చనిపోయాయి. మొత్తం 4000 రూ॥ దాకా డబ్బులు కాలి పోయాయి. 60 బస్తాల ధాన్యం తగలబడి పోయాయి.

24 ఇళ్లు తగలబడిపోయిన గంజిగెడ్డలో 360 బస్తాల ధాన్యం తగలబడి పోయింది.

ఈ గూడాలన్నీ అత్యధికంగా ఒకే ఒక తెగకు చెందినవి. ఆ తెగ పేరు సామంతులు లేక కోదులు. (Konds) ఒకే తెగకు రెండు పేర్లెందుకున్నాయంటే అదే ఒక కథ. వీళ్ళ అసలు పేరు సామంతులు. అసలు నివాసం ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా. వీళ్ళు అన్ని రకాలుగా చాలా వెనకబడిన వాళ్ళు. మగవాళ్ళు గోచితప్ప వేరే బట్టకట్టుకోరు. ఆడవాళ్ళు ఇప్పుడిప్పుడే చీర చుట్టు

కోవడం నేర్చుకుంటున్నారు. వ్యవసాయం చాలా ఆదిమమయిన "పోడు" పద్ధతిలో చేస్తారు. ఎడ్లుగాని గట్టి నాగళ్లుగాని వాడరు. కొన్ని ఎకరాల అడవిని ఒకసారి నరికి తగలబెడతారు. తగలబడి బూడిదయిన అడవి వర్షానికి తడిస్తే నేలను చాలా సారవంతం చేస్తుంది. ఆ నేలలో అయిదారేళ్ళు ఎటువంటి ఎరువులూ అవసరం లేకుండ చోళ్లు వడ్లు పండిస్తారు. అప్పటికి అది సారాన్ని కోల్పోతుంది. అంతటితో దాన్ని వదిలిపెట్టి మరి కొన్ని ఎకరాల అడవిని నరికి "పోడు" చేస్తారు. ఈ రకంగా సంచరిస్తూ వీళ్ళు పెద్ద సంఖ్యలో 1950 నుండి ఒరిస్సా నుండి విశాఖపట్నం అడవులకు వలస వస్తూవున్నారు. ప్రస్తుతం విశాఖపట్నం అడవులలో ఈ సామంతుల సంఖ్య 1 లక్షదాకా ఉంటుందని అధికారుల అంచనా.

అయినప్పటికీ మన రాష్ట్రంలో వీళ్ళకు ఒక షెడ్యూల్డు తెగగా గుర్తింపులేదు. లక్షణాలు లెక్కగడితే వీళ్ళే రాష్ట్రం మొత్తంమీద వెనుకబడిన తెగ అయి వుంటారు. అయినా ఒక "తెగ"గా గుర్తింపు లేదంటే ఈ విడ్డూరానికి మన రాష్ట్ర ప్రభుత్వం వైఖరే కారణం. 1978లో ఒక ప్రతినిధుల బృందం ఈ సామంతుల తరఫున హైదరాబాద్ వెళ్ళి సంబంధిత ప్రభుత్వ అధికార్లను కలవగా, మన రాష్ట్రంలో నివసించే తెగల జాబితాలో "సామంతులు" అనే తెగలేదు, అది "ఒరియా" తెగ, కాబట్టి ఒకవేళ వాళ్ళు ఇప్పుడు ఇక్కడ నిజంగానే ఉంటున్నప్పటికీ గుర్తింపు ఇవ్వలేం అన్నారంట. అయితే తమ పేరు సామంతుల నుండి కోదులకు (Konds) మార్చుకుంటే గుర్తింపు ఇవ్వగలుగుతామన్నారంట. వాళ్ళు అలాగేనని పేరు మార్చుకున్నారుగాని ఇప్పటిదాకా గుర్తింపు మాత్రం రాలేదు!

ఇది ఇలాగుండగా, "పోడు" వ్యవసాయం చేస్తున్నందుకు అటవీ అధికారుల నుండి, పోలీసుల నుండి, బెదిరింపులూ వేధింపులూ మాత్రం నిరంతరం ఉంటూనే ఉన్నాయి. ఈ అధికారులు అడపా దడపా సామంతుల గూడాలకు పోయి అన్నం, కోడికూర వండించుకొని తిని దొరికినంత రొక్కం చేతపుచ్చుకొని పోతూంటారు. గత కొద్ది సంవత్సరాలగా "అన్న"ల (అంటే నక్సలైట్ పార్టీ కార్యకర్తల) అందదండల వల్ల గిరిజనులు ఈ దోపిడీని తప్పించుకోగలుగుతున్నారు.

ఇది నేపథ్యం. "నక్సలైట్ల" ఏరివేత కార్యక్రమంలో భాగంగా ఈ సామంతులమీద చర్య తీసుకోవాలన్న ఆలోచన మన రాష్ట్ర ప్రభుత్వానికీ దాని సాయుధ బలగమయిన పోలీసులకూ ఎందుకు కలిగిందో ఇప్పుడు స్పష్టమే. ఆ చర్య గృహ దహనాల రూపం తీసుకోవడం యాదృచ్ఛికం కాదు - గత మూడేళ్ళగా మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తూన్న విధానమే. ఈ గృహ దహనాలను కొన్ని పత్రికలు బయటపెట్టిన పిదప మన రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ రాంమోహన్‌రావు వాటిని బాహాటంగా సమర్థిస్తూన్నట్టుగా ఇది ఏప్రిల్ 26న లంకపోకల వద్ద జరిగిన "ఎన్‌కౌంటర్"లో ఒక నక్సలైట్ కార్యకర్తతో బాటు ఒక పోలీసు కానిస్టేబుల్ కూడ చనిపోయిన సంఘటనకు నిరసనగా చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు "ఉద్రిక్తులయి" చేసిన పని ఎంత మాత్రం కాదు. నిజానికి ఈ సంవత్సరం జనవరి నుండి కూడ "సామంతుల గూడాలు తగలబెడతారంట" అన్న వదంతి చింతపల్లి మార్కెట్‌లో వినపడుతూనే వుంది.

అప్పుడు కొందరు స్థానిక పెద్దలు పోలీస్ అధికార్లకు లంచాలు ఇచ్చి పంచాయతీ... 

మంతల ఎన్నికలు అయిపోయేదాకా వాయిదా వేయించారు. మార్చి నెలలో, ఎన్నికలు అయిపోగానే, గృహ దహనాలు మొదలయ్యాయి. దహనాలు మార్చి నెల నుండి జరుగుతున్నట్టు చింతపల్లి ఎం. ఆర్. ఓ. స్వయంగా ఒప్పుకున్నాడు. మరి మవ్వు ఉండి- మేజిస్ట్రేట్ హోదా కలిగివుండి - ఏం చేస్తున్నావయ్యా అంటే, గతంలో తాను ఎక్కడో తాసీల్దారుగా పనిచేసినప్పుడు ఒక పోలీస్ అధికారి అక్రమ వర్తనంలో జోక్యం చేసుకోబోయి ఎంతగా చేయి కాల్చుకుని ఎంత దూరం బదిలీ అయిందీ విషాదంగా విన్నవించుకొని మన్నించమంటాడు.

మార్చి నెలలో ప్రారంభం అయిన ఈ దహనాలు మే నెల 2, 3 తేదీలలో పతాకస్థాయిని చేరుకున్నాయి. చింతపల్లి ఎస్.ఐ. అమ్మినాయుడు నేతృత్వంలో 30 మంది సాయుధ పోలీసులు 2వ తేదీ ఉదయం బయలుదేరారు. రెండు కొండల మధ్యనున్న లోయ ఒక కొన నుండి బయలుదేరి ఒక్కొక్క గూడెం తగల బెట్టుకుంటూ పోయారు. ధాన్యం, కోళ్ళు, ఇతర సామాన్లు బయట పడేసుకునేందుకు వ్యవధి ఇమ్మని ప్రాధేయపడినా ఇవ్వలేదు. ఈ క్రూరత్వం కొన్నిచోట్ల చాలా నాటకీయంగా ప్రదర్శించారు. తెంటాల వీధి అనే గూడెం (22 ఇళ్లు) లోనికి పోలీసు పార్టీ ప్రవేశించగానే గూడెం పెద్ద సాగి రామారావు ఎస్. ఐ. దగ్గరికి పోయి అరగంట టైం ఇవ్వండి, సామాన్లు బయట పడేసుకుంటాం అంటే ఎస్. ఐ. అతని మొర ఆలకించకపోగా, అతని దవడలు, వాయించి, అతని జేబులోంచే అగ్గిపెట్టె తీసి ముందు అతని గుడిసే తగలబెట్టి ఆటు తరువాత తక్కిన 21 గుడిసెలు తగలబెట్టాడు!

ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి ఉంది. ఈ గృహదహనాలకు కారణం ఏమిటని అధికార్లను అడగగా చింతపల్లి ఎం. ఆర్. ఓ. గారు ఏమంటారంటే 'గిరిజనులు చట్టానికి వ్యతిరేకంగా అడవులను నరికి వ్యవసాయం చేస్తున్నారు. కాబట్టి వాళ్ళను అక్కడి నుండి తొలగించే అధికారం అటవీశాఖకూ, పోలీసులకూ ఉంటుంది'. (అయినా ఇళ్లు తగలబెట్టమని ఎక్కడాలేదు- అది వేరే సంగతి). కాని దాడికి బయలుదేరిన పోలీసు పార్టీ ఏ గ్రామంలోనూ 'మీరు అడవిని నరుకుతున్నారా లేక పొలాలకు పట్టాలు ఉన్నాయా' అని అడగలేదు. 'మీరు నక్సలైట్లకు అన్నం పెడుతున్నారా' అని మాత్రమే అడిగారు. చెప్పేదేమో అటవీ సంరక్షణ, చేసేదేమో రాజకీయం అని దీన్నిబట్టి అర్థం అవుతుంది.

మొత్తానికి మే 3వ తేదీ నాటికి చింతపల్లి ఎస్. ఐ. గారు తన అత్యుత్సాహంతో, సామంతుల గూడాలతోబాటు, పొలాలకు పట్టాలున్న బగత, గదబ తెగలకు చెందిన చిత్తమామిడి అనే గూడాన్ని కూడ తగలబెట్టాడు. తగలబడిన అన్ని గూడాలలోకీ పెద్దదీ, ఎక్కువ నష్టపోయిందీ ఈ గూడెమే. ఆ గూడెపు బగతలంతా గోలగోలగా తమ తెగనాయకుడు, మాజీ - కమ్యూనిస్టు, ప్రస్తుతం సంకాడ గ్రామానికి సర్పంచ్ అయిన వీరన్న పడాల్‌కు పోయి మొరపెట్టుకున్నారు. ఆయన చింతపల్లికి పోయి ఈ మధ్యనే అక్కడ డి. ఎస్ పి. పదవిచార్జి తీసుకున్న వెంకట్రాం రెడ్డిగారికి ఈ అన్యాయాన్ని విన్నవించుకున్నాడు. (ఈ అధికారి చరిత్ర చెప్పకోవాలంటే మరొక రిపోర్టు రాయాల్సి వుంటుంది. వరంగల్‌లో ఎస్.ఐ.గా 'అగ్గిబరాటా' అని పేరు సంపాదించుకొని

ఆదిలాబాద్‌కు సి. ఐ. గా ప్రమోషన్ మీద వెళ్ళి సోత్నాలలో గోండు గిరిజనులమీద ఉత్తపుణ్యానికి కాల్పులు జరిపి 50 మందిని తన మీద హత్యా ప్రయత్నం చేసారని అరెస్టుచేసి జైలుకుపంపి, అక్కడి నుండి కరీంనగర్ జిల్లా రామగుండం సి.ఐ. గా బదిలీమీద వెళ్లి అక్కడ గని కార్మికుల మీద తన ప్రతాపం చూపి ఇప్పుడు మళ్ళీ ప్రమోషన్ మీద చింతపల్లి ఏజెన్సీకి వచ్చి గృహదహన యజ్ఞాన్ని జరిపిస్తున్నారు.)

వీరన్న పడాల్ విన్నపం విన్న డి సిస్ పి గారు, మేము సామంతుల ఇళ్ళు తగలబెట్టమంటే మీ ఇళ్ల తగల బెడుతున్నారా అని (పాపం) బాధ పడ్డాడట. అట్లాగని ఒక కాగితం మీద రాసి వ్వండి, పోలీసు పార్టీకి చూపించి మేము మా ఇళ్ళు కాపాడు కుంటాం అని వీరన్నపడాల్ మొరపెట్టుకున్నాడు. అలాగేనని ఆయన ఆదేశం ఇవ్వగా చింతపల్లి ఎస్ హెచ్ వో ఈ క్రింది ఉత్తరం రాసి ఇచ్చాడు.

Sri

Combing Party Incharge గారికి తెలియ జేయునది. "కోదుల" గ్రామాలు తప్ప బగత, గదబలు గ్రామాలు కాల్చవద్దని శ్రీ డి. ఎస్ పి. చింతపల్లి దొర వార్కి శంకాద ప్రెసిడెంటుగారు విన్నవించుకోగా పై ఉత్తర్వులు శ్రీ డి. ఎస్. పి సి.టి పి గారు Combing Party Inchargeగార్ల తెలియజేయమన్నారు. కావున బగతలు గదబలు గ్రామాలు, ఇండ్లు తగల బెట్టవద్దని శ్రీ డి ఎస్ పి దొరవారు చెప్పినారు కావున CTP PS SHO గా మీకు తెలియ జేసుకొనుచున్నాము.

సం॥

HC 163 3/5/87

స్టేషన్ హౌస్ ఆఫీసర్

చింతపల్లి పోలీస్ స్టేషన్

(స్పెల్లింగ్ తప్పులు, వ్యాకరణం తప్పులు వక్కాణింపులు. అన్నీ పోలీసు వారివే)

సంకాడ సర్పంచ్ అక్కడితో ఆగక పాడేరులోని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసరుకు, సబ్‌కలెక్టరుకు, పత్రికా విలేఖరులకు కూడ ఈ దహనాల విషయం తెలియ జేయడంతో, తాత్కాలికంగా నయినా ప్రస్తుతానికి దహనాలు ఉపశమించాయి. ఆ తరువాత సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల పెద్దలు వచ్చి గిరిజనులకు ఆర్థిక సహాయం ఇస్తామనీ ఇల్లు కట్టిస్తామనీ అన్నారు. అయితే ఒక్కొక్క కుటుంబానికీ ఆస్తి నష్టం ఎంత జరిగిందో ఇప్పటిదాకా అంచనా కూడలేదు. ఎటువంటి అంచనా లేకుండ ఒక్కొక్కరికి కేవలం 250 రూపాయల రొక్కం, ఒక చీర ధోవతి ఇచ్చారు. ఇల్లు కట్టిస్తామన్నారు గాని, ఇప్పుడున్న చోట కాక ఎక్కడ పంచాయితీ బంజర్లు దొరికితే అక్కడ కడతారు- అది గిరిజనుల చేలకు ఎంత దూరం అయినా కావచ్చు. అన్నిటి కంటే ముఖ్యంగా, అడవిని రిజర్వ్‌చేసి గిరిజనులకు వ్యవసాయ భూమి ఇప్పించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఎంత మాత్రంలేదు. కాబట్టి అసలు సమస్య అలాగే ఉండిపోతుంది.

# కరీంనగర్

రోజుకి రెండు పూటలా పట్టెడు మెతుకులు దొరకని పేదలు ఉన్న కాస్త నీడనిచ్చే ఇంటిని స్వయంగా కూలగొట్టుకోవడం, కాల్చుకోవడం మీరెక్కడైనా విన్నారా ? "అంతర్జాతీయ గృహ వసతి" సంవత్సరంలో పోలీసు లాఠీల, తూటాల సాక్ష్యంగా కరీమ్‌నగర్ జిల్లాలోని అనేక గ్రామాల్లో ఈ రకం 'సంఘటనలు' జరిగాయి.

దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పౌరహక్కుల కార్యకర్తలతోను, స్థానిక పత్రికా విలేఖరులతోనూ కూడిన ఒక నిజ నిర్ధారణకమిటీ జూలై 4,5 తేదీలలో కరీంనగర్ పర్యటించి నప్పుడు అటువంటి అనేక ఉదంతాలు స్వయంగా చూసింది.

హైదరాబాద్ నించి 4వ తేదీన బయలుదేరిన బృందం మొదటగా ఎల్లారెడ్డిపేట మండలంలోని 'దూమాల' గ్రామాన్ని సందర్శించింది. ఈ గ్రామంలో పొన్నం ఎల్లయ్య అనే కల్లుగీత కార్మికుడి ఇంటిని పోలీసులు షుమారు 9 నెలల క్రితం కూల గొట్టి ధ్వంసం చేశారు. పొన్నం ఎల్లయ్య కుమారుడు రామచం ద్రం రైతుకూలీ సంఘం కార్యకర్త. పెద్దపల్లి డి. ఎస్. పి. బుచ్చిరెడ్డి హత్య జరిగిన కొద్ది రోజుల అనంతరం యూనిఫారంలో ఉన్న పోలీసులు పెద్ద సంఖ్యలో ఓ రోజు మధ్యాహ్నం రామ చంద్రాన్ని పట్టుకొనేందుకు వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరు. రెండు భాగాలుగా వున్న ఇంటి తలుపులను బద్దలు కొట్టి, దర్వాజాలు కూలగొట్టి, ఇంటి పైకప్పును నేల కూల్చారు. లోపల సామాన్లను చిందర వందర చేసి, కొన్ని వస్తువులను నూతిలో వేశారు. ఈ బీభత్సానికి పోలీసులు గ్రామస్తుల 'సహ కారా'న్ని కూడ తీసికొన్నారు, సహకరించని గ్రామస్తులను తమ సహజరీతిలో బూట్లతోనూ, లాఠీలతోనూ సత్కరించారు. ఈ బీభత్సకాండను యెల్లయ్య మరదలు గౌరమ్మ ఇంకా బెదిరిపోయిన ముఖంతో కళ్ళకు కట్టినట్లుగా బృందానికి వివరించింది, మిగతా గ్రామస్తులు కూడ గౌరమ్మ కథనాన్ని బలపరిచారు. పోలీసులు తమ చేతనే ఇళ్ళు కూలగొట్టించారనీ, నిరాకరించిన వారిని చితక బాదారని వారు ఆరోపించారు. ఇప్పటికి ఇంటిలో కొంత భాగాన్ని బాగుచేయించు కున్నప్పటికీ ఇంకా చాలా భాగం బాగుచేయించు కోవలసివుంది. ఇప్పటికే 10 వేల రూపాయలు ఖర్చు అయినాయనీ, ఈ ఖర్చు తమశక్తికి మించిన భారమనీ ఆ వృద్ధురాలు వాపో యింది. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకు రామచంద్రం పోలీ సులకు సరెండర్ అయ్యాడు. పోలీసులు అతన్ని అక్రమంగా 15 రోజుల పాటు లాకప్‌లో వుంచి ఆ తరువాత విడిచిపెట్టారు.

తరువాత బృందం కోనరావుపేట మండలంలోని వెలిశ ట్టావ్‌పేటను సందర్శించింది. "కొండాపూర్ ఎన్‌కౌంటర్"గా ప్రసిద్ధి చెందిన పోలీసు హత్యలు ఈ గ్రామ సరిహద్దుల్లోనే జరిగాయి. ఈ "ఎన్‌కౌంటర్"లో చనిపోయిన వారిలో ఇద్దరు ఈ గ్రామానికి చెందినవారే, వారిద్దరికీ వివాహమైంది. వాళ్ళ కుటుం బాలు నిరాధారమై ఆకలితో అలమటిస్తున్నాయి. ఈ గ్రామంలో పోలీసులు మొత్తం మూడు ఇళ్ళను కూలగొట్టారు. ఈ మూడు ఇళ్ళు బైరొగాని లచ్చయ్య, ఇటిక్యాల మైసయ్య, బుర్రా రాజయ్య లకు చెందినవి. బైరొగాని లచ్చయ్య బృందంతో మాట్లాడుతూ

తన [illegible]ుని వెళ్ళబోసుకున్నాడు. తన కుమారుడు మధు, మైసయ్య కుమారుడు నరసయ్య, రాజయ్య కుమారుడు మల్లయ్య రైతు కూలీ సంఘం కార్యకర్తలని, వీళ్ళు ముగ్గుర్నీ లింగంపేట్, అల్మాస్‌పూర్ హత్య కేసుల్లో ముద్దాయిలనీ వివరించాడు. నరసయ్య, మల్లయ్య నాలుగేళ్ళ క్రితం అదృశ్యం అయ్యారని, తన కుమారుడు గత అగస్ట్ 5వ తారీకున సిరిసిల్లా కోర్టుకి వెళ్ళి మళ్ళీ కనబడలేదని కళ్ళ నీళ్ళతో వివరించాడు. పోలీసులు మొదటి సారిగా రెండు సంవత్సరాల క్రితం గ్రామంలోకి వచ్చి తన ఇళ్ళను కూలగొట్టారని, మళ్ళీ 9 నెలల క్రితం మరోసారి వచ్చి పూర్తిగా ధ్వంసం చేశారని, అప్పుడు తాను లేనని, గ్రామస్తులను బెదిరించి, చితకబాది ఇల్లు కూలగొట్టించారని, ఈ సంఘటన జరిగాక చాలా కాలం వరకు కూడ గ్రామంలో పోలీస్ క్యాంప్ ఉందనీ (అంటే నెల క్రితం వరకు కూడ) వివరించాడు. తను అప్పుచేసి 5 వేల రూపాయలతో ఇల్లు కొంత భాగాన్ని బాగు చేయించుకున్నానని లచ్చయ్య వివరించాడు. లచ్చయ్యకి ఒక ఎకరం పొలం, అయిదు తాటి చెట్లు వున్నాయి. చాలీచాలని సంపాదనతో, తినీ తినని బతుకు బతుకుతున్న లచ్చయ్య కుటుంబం ఎర్ర టోపీల దమనకాండతో అన్ని విధాల కుంగి పోయింది. గ్రామస్తులు కూడ పోలీసులే ఈ ఇళ్ళు కూల గొట్టారని, తమని తన్ని మరీ ఈ పనిలో భాగస్తులుగా చేశారని ఆవేదనతో చెప్పారు.

ఆ తరువాత బృందం మరునటి రోజు ఉదయం పెద్దపల్లిని సందర్శించింది. పెద్దపల్లిలో ఒక స్థానిక పత్రికా సంపాదకుడు మాట్లాడుతూ బుచ్చిరెడ్డి హత్య తర్వాత పోలీసులు తమకు వ్యతిరేకమైన వారినందర్నీ "రాడికల్స్"గా చిత్రించి అక్రమంగా కేసుల్లో ఇరికిస్తున్నారని, అనేక రకాలుగా హింసిస్తున్నారని ఆరోపించాడు. మండలంలోని పెద్దపల్లి మంగపేటలో శంకర్ అనే వ్యక్తి ఇంటిని పోలీసులు కూలగొట్టారని కూడా వివరించాడు. పెద్దపల్లి నించి బయలుదేరిన బృందం పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్‌ని సందర్శించింది. రాఘవాపూర్‌లో పోలీసులు దగ్గుల బాలరాజ్‌కి చెందిన కొత్త ఇంటిని దాదాపుగా తగులబెట్టారు. బాలరాజ్ కుమారుడు రాయలింగం రాడికల్స్‌లో చేరి గత నాలుగేళ్లుగా కనబడటం లేదు. అతనికి కుటుంబంతో ఎటువంటి సంబంధం లేదు. బుచ్చిరెడ్డి హత్యానంతరం పోలీసులు వచ్చి రాయలింగాన్ని అప్పచెప్పమని దబాయించారు. "మాకేం తెలియద"ని బాలరాజ్, అతని భార్య లక్ష్మి కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమిలాడినా వినిపించుకోకుండా మొదటి విడతగా కిటికీలు, ద్వారబంధాలు ఊడగొట్టారనీ, అంతటితో ఆగకుండా తననీ, తన భార్య లక్ష్మినీ, గోదావరి ఖనిలో బావి పనిచేసే తన ఇద్దరు కొడుకులను, ఇంకా కొంతమంది బంధువులను పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎనిమిది రోజులు అక్రమంగా లాకప్‌లో ఉంచారని, ఆ సమయంలోనే, ఇంట్లో ఎవరూ లేనప్పుడు పోలీసులు పెద్ద ఎత్తునవచ్చి ఇంటిని పూర్తిగా కూలగొట్టారని చెప్పాడు. గ్రామస్తులు కూడ ఆ సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకుంటూ దీపావళి వెళ్ళిన రెండు రోజుల తరువాత పోలీసులు మూడు లారీలు, మూడు జీపుల్లో వచ్చి పూర్తిగా ధ్వంసం చేశారని వివరించారు. ఇల్లు ఏదో యుద్ధ విమానం బాంబు వేస్తే పూర్తిగా దెబ్బతిన్న శిధిలగృహంలా వుంది. ప్రహరీగోడ శకలాల్ని బావిలో వేయగలిగారంటే రక్షక భటుల రాక్షసత్వం మనకు అర్ధం అవుతుంది. ఇంటిలో వస్తువులన్నీ పైశాచికంగా బద్దలుకొట్టారు, బట్టలను తగులబెట్టారు. ఎలా "సౌకర్యం"గా వుంటే అలా ధ్వంసం చేశారు. దిష్టికోసం కట్టిన గుమ్మడి పండుని మాత్రం ఎందుకో వదిలిపెట్టారు. (బహుశా మూఢ నమ్మకాల భయమేమో) ప్రస్తుతం బాలరాజ్ కుటుంబం ఒక అద్దె ఇంటిలో నివసిస్తున్నారు.

అదే రోజు బృందం అదే మండలంలోని పెద్దకల్వాం గ్రామాన్ని సందర్శించింది. ఈ గ్రామంలో నార్ల రాఘవులు అనే వ్యక్తి ఇంటిని పోలీసులు నేల కూల్చారు. నార్ల రాఘవులు Extra Departmental Branch Post Master గా పని చేస్తున్నాడు. అతని జీతం నెలకు 243 రూ॥ దానితోనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని ఇరవై ఏళ్ళ కుమారుడు ఛత్రపతి శివాజీ రాడికల్స్‌లో చేరాడు. గత నాలుగు సంవత్సరాలుగా అతని ఆచూకీ లేదు. గత నవంబర్ పధ్నాలుగవ తేదీన కర్తవ్య దీక్షాపరాయణులైన ఖాకీదారులు అది ప్రభుత్వ ఆస్తి అనే సంకోచం ఐనా లేకుండా ఇంటి మొత్తాన్ని కూల్చారు.

అదే రోజు రాత్రి బృందం కరీంనగర్ ఎస్. పి. లోకేంద్ర శర్మని కలిసింది. ఆయన్ని ఇళ్ళ కూల్చివేత గురించి ప్రశ్నించినప్పుడు పోలీసులు నిర్దోషులని వెనకేసుకు వచ్చారు. పైగా ఇళ్ళ కూల్చివేతకి సంబంధించి పోలీసులు గ్రామస్తులపై పెట్టిన 18 (తప్పుడు) కేసుల గురించి వివరించారు.

## నీరుకొండ : మరో కారంచేడు

చీరాలలో దళితులు జులై 17న కారంచేడు ఘటన ద్వితీయ వార్షిక సభలు జరుపుకునేందుకు తయారౌతున్న సమయంలో నీరుకొండ భూస్వాములు దళితులపై దాడి జరపడం ద్వారా మరో కారంచేడును సృష్టించారు. కారంచేడు ఘటన నుండి స్ఫూర్తి పొందారనిపించే విధంగా సరిగ్గా అదే పద్ధతిలో పధకం ప్రకారం భూస్వాములు దాడిచేసి బరిసెలు గొడ్డళ్ళతో ఒక హరిజన వృద్ధుడిని హత్య చేశారు. ఎందరినో గాయపరిచారు. కారంచేడులో ముఖ్యమంత్రి బంధువర్గం దాడిలో ప్రధానపాత్ర వహించగా నీరుకొండలో మాజీ మంత్రి సోదరులు ప్రముఖంగా నాయకత్వం వహించారు.

### నేపధ్యం :

గుంటూరు జిల్లాలోని మంగళగిరికి 10 కి.మీ దూరంలో పడమటి దిక్కునవున్న ఐదువేల జనాభాగల గ్రామం నీరుకొండ. జనాభాలో 50 శాతంపైగా 200 కుటుంబాల కమ్మ కులస్తులు. భూమిలో 90 శాతం వారిదే. 40 శాతంగావున్న 160 కుటుంబాల హరిజనులు భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలు. మిగతా జనాభా యాదవ, కాపు, చాకలి వగైరా వెనుకబడిన కులస్తులు. ఎకరం 10 వేల రూపాయల నుండి 30 వేలదాకా విలువచేసే పొగాకు పండే మెట్ట పొలాలు ప్రధానంగా ఐదుగురు కమ్మ భూస్వాముల ఆధిపత్యంలో వున్నాయి. గ్రామంలో 200 దాకా పొగాకు బార్న్లు వున్నాయి.

వ్యవసాయ సంబంధాలు అంతగా అభివృద్ధి చెందని నీరుకొండలో హరిజనులు పొలాల్లో కూలికి వెళ్ళడం, బార్న్లకు